చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీసీపీ కె.సురేశ్‌కుమార్, ఏసీపీలు

జీడిమెట్ల, జూన్ 27 : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కొత్తగా తెచ్చిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని బాలానగర్ జోన్ డీసీపీ కె.సురేశ్‌కుమార్ సూచించారు. బాలానగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో డీసీపీ మాట్లాడారు. అనంతరం ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై 8వ బ్యాచ్ శిక్షణ తరగతులను పూర్తి చేసి ఉత్తమ ప్రతిభను కనబర్చిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చింతామణి పద్యనాటక ప్రదర్శన

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 27 : కేపీహెచ్‌బీ కాలనీలోని నవక్రాంతి కల్చరల్ అసోసియేషన్ 26వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం కాలనీ 3వ ఫేజ్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో చింతామణి పద్యనాటకం ప్రదర్శించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు, నంది అవార్డు గ్రహీత యం.అర్జున్‌రావు తెలిపారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

దుండిగల్, జూన్ 27 : కత్బుల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అలుమేలు మంగ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకనామిక్స్, హిస్టరీ,రాజనీతిశాస్త్రం, కంప్యూటర్ సైన్స్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, బోటనీ,జూవాలజీ సబ్జెక్టుల్లో జూలై 1 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం, నెట్/సెట్/పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని వివరించారు.

బాచుపల్లి ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలి

● కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్/కుత్బుల్లాపూర్, జూన్ 27 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 3.97 కోట్లతో ప్రారంభించిన బాచుపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సంబంధిత అధికారులకు సూచించారు. కొంపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాచుపల్లి ఫ్లైఓవర్, బాచుపల్లి, బౌరంపేట్, బహదూర్‌పల్లి, కొంపల్లి రోడ్డు విస్తరణ పనులపై గురువారం ఆయన హెచ్ఎండీఏ, జల మండలి, అటవీ, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్డు విస్తరణ పనుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

మియాపూర్ నుంచి గండిమైసమ్మ వరకు, కొంపల్లి – బహదూర్‌పల్లి రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి అటవీ భూములకు ఆ శాఖ నుంచి అనుమతి తీసుకొని రోడ్డు విస్తరణ వేగవంతంగా చేయాలని ఆదేశించారు. నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు, దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ, కొంపల్లి కమిషనర్ శ్రీహరి, గండిమైసమ్మ–దుండిగల్ తాసీల్దార్ మతిన్, హెచ్ఎండీఏ అధికారులు యూసుఫ్‌హుస్సేన్, అప్పారావు, హరికృష్ణ, వేణుగోపాలరావు, రమేశ్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

వివిధ విభాగాల అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దైవచింతనతో మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే

దుండిగల్ : దైవచింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గురువారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి సారెగూడెంలోని బంగారు మైసమ్మ తల్లి ఆలయ 5వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన బోనాల జాతరలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేందర్‌యాదవ్, సాయియాదవ్, బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి,డైరెక్టర్లు వెంకటేశ్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు,ఆలయ కమిటీ ప్రతినిధులు, వార్డు మాజీ సభ్యుడు శ్రీశైలం పాల్గొన్నారు.

పేదలకు వరం.. సీఎం సహాయ నిధి

మియాపూర్, జూన్ 27 : సీఎం సహాయ నిధి పథకం పేదలకు వరమని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ సాయంతో కార్పొరేట్ దవాఖానల్లో ఉచితంగా వైద్యం పొందవచ్చునన్నారు. హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటీ హిల్స్‌కు చెందిన భీమ రాజుకు అత్యవసర వైద్యసేవల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ. 75 వేల ఎల్ఓజీ మంజూరు కాగా ఆ పత్రాలను ఎమ్మెల్యే గురువారం తన నివాసంలో బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరికంతో ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకుండా ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తున్నదన్నారు. పేద ప్రజలకు కొండంత ధైర్యాన్నిస్తున్నదని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు.

ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలను తొలగించండి..

మియాపూర్, జూన్ 27: ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ మురికి వాడల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో విద్యుత్‌స్తంభాలు రోడ్డు మధ్యలో ఉన్నాయని, వాటితో ప్రమాదాలతోపాటు రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. విద్యుత్ వైర్లు, పాత స్తంభాలను మార్చాలని, పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ సంబంధిత అధికారులకు సూచించారు. పలు ట్రాన్స్‌ఫార్మర్లు రక్షణ గోడలు లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ సమస్యల్లేకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో డీఈ చక్రవర్తి, ఏడీఈ ప్రసాద్, ఏఈ షాబాజ్, పార్టీ నేతలు దొడ్ల రామకృష్ణ గౌడ్ , వెంకట్‌నాయక్, షౌకత్ అలీ మున్నా, సయ్యద్, అశోక్, శంకర్, ఫారూక్, ఖలీం, బషీర్, సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు నిల్వకుండా పటిష్ట చర్యలు

● అధికారులతో కలిసి శేరిలింగంపల్లి జోన్‌లో పర్యటించిన జడ్సీ ఉపేందర్‌రెడ్డి

కొండాపూర్, మియాపూర్, జూన్ 27 : వర్షాకాలంలో వరద నీరు నిల్వకుండా ఉండేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఇంజినీరింగ్, బయోడైవర్సిటీ, శానిటేషన్, విద్యుత్ విభాగాల అధికారులతో కలిసి జోన్ పరిధిలోని నెక్టార్‌గార్డెన్, త్రిషూల్ గార్డెన్, లింగంపల్లి ఆర్‌యూబీ, బయోడైవర్సిటీ కూడలి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ.. వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. నాలాల్లో డిసిల్టింగ్ చేపట్టడంతో పాటు మ్యాన్‌హోళ్లు, నాలా వంతెనల వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరదనీటి కాలువ ఆక్రమణలను వెంటనే తొలగించాలని, విద్యుత్ స్తంభాలను రీలొకెట్ చేయాలన్నారు. వరద నీటి కాలువల నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈదురు గాలులతో విరిగిపోయిన చెట్లను, గ్రీన్ వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఎస్ఈ శంకర్, ఈఈ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ మెహ్రో, వైద్యాధికారి డాక్టర్ నగేశ్‌నాయక్, డీఈ, ఏఈ పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి జోన్‌లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి,ఇతర అధికారులు

రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుకుందాం..: జడ్సీ

మియాపూర్ : శేరిలింగంపల్లి జోన్‌ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుకునేందుకు సమన్వయంతో కృషి చేయాలని జడ్సీ ఉపేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. జోన్ పరిధిలోని శానిటేషన్ నిర్వహణపై జోనల్ కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ జోన్‌లోని వాణిజ్య ప్రాంతాల్లో చెత్త సేకరణ వంద శాతం పకడ్బందీగా జరగాలన్నారు. ఇండ్ల వద్దే తడి,పొడి చెత్త సేకరణను వేరు చేసి ఇచ్చేలా ప్రజల్లో మరింత అవగాహన పెంచాలన్నారు. స్వచ్ఛ ఆటోల సిబ్బంది సైతం అదే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేసే ప్రాంతాలను గుర్తించి పూర్తి స్థాయిలో నిర్మూలించాలని, ఆ ప్రాంతాలను ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని జడ్సీ పేర్కొన్నారు. నిర్మాణ వ్యర్థాల సేకరణపై శ్రద్ధ వహించాలని, అనధికారికంగా రహదారుల పక్కన డంప్ చేసే వారిని ఉపేక్షించవద్దని తెలిపారు. స్వచ్ఛ ఆటోల సిబ్బంది మరింత చురుకుగా పనిచేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో తగిర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో నాలుగు సర్కిళ్ల డీసీలు రజనీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ, సురేశ్, నాయక్, వైద్యాధికారులు, పీవోలు, ఎస్ఎస్‌లు, ఎస్ఆర్‌పీలు పాల్గొన్నారు.

జలమండలి సీజీఎం శ్రీధర్‌రెడ్డికి వీడ్కోలు

సీజీఎం శ్రీధర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

జగద్గిరిగుట్ట, జూన్ 27 : జలమండలి సీజీఎం శ్రీధర్‌రెడ్డి తన పదవీ కాలంలో మెరుగైన సేవలందించారని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఐడీఏఎల్ జలమండలి కార్యాలయంలో గురువారం శ్రీధర్‌రెడ్డి పదవీవిరమణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మంచినీటి సరఫరాలో శ్రీధర్‌రెడ్డి అందించిన సేవలు గొప్పవని కొనియాడారు. శ్రీధర్‌రెడ్డి మట్లాడుతూ తనకు సహకరించిన సిబ్బంది, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జలమండలి సిబ్బంది శ్రీధర్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్ స్వామి, సీజీఎంలు విజయరావు, వినోద్‌భార్గవ, కిరణ్ కుమార్, నాగేంద్రకుమార్ సుబ్బారాయుడు, డీజీఎంలు, మేనేజర్లు, కాంట్రాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత

శేరిలింగంపల్లి, జూన్ 27 : గౌలిదొడ్డిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మథన్ పాఠశాల విద్యార్థులు చేయూతను అందించారు. గురువారం ప్రభుత్వ పాఠశాలలో తరగతుల నిర్వహణ, గ్రంథాలయ ఏర్పాటుకు అవసరమైన పుస్తకాలు, విద్యా సామగ్రిని అందజేశారు. ప్రాజెక్టు ప్రజ్ఞా పేరుతో మంథన్‌కు చెందిన 10 మంది 9వ తరగతి విద్యార్థులు గౌలిదొడ్డి ప్రాథమిక తరగతుల విద్యార్థులకు ఇంగ్లిష్, సైన్స్, గణితం తరగతులు బోధించి ఆకట్టుకున్నారు. విద్యార్థుల్లో సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఈ తరహా కార్యక్రమాలు చేపట్టినట్లు మంథన్ స్కూల్ ప్రిన్సిపాల్ సుర్జీత్ సింగ్ తెలిపారు.

గౌలిదొడ్డి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బోధిస్తున్న మంథన్ పాఠశాల విద్యార్థులు

ముంపు సమస్యలను పరిష్కరించాలి..

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 27 : లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సతీశ్‌గౌడ్ అధికారులకు సూచించారు. గురువారం డివిజన్ పరిధిలోని ఎల్‌బీ శాస్త్రీ నగర్‌లో లోతట్టు ప్రాంతాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీలో వరదనీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, వరదనీరు దిగువకు వెళ్లేందుకు క్యాచ్ పిట్లను ఏర్పాటు చేయాలన్నారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ పవన్, స్థానిక నేతలు అప్జల్,బెట్టు శ్రీను, సురేందర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీ శాస్త్రీనగర్‌లో ముంపు సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్, ఏఈ పవన్

మౌలిక వసతుల కల్పనకు కృషి

శేరిలింగంపల్లి, జూన్ 27 : డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నానని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని గోపన్‌పల్లి గ్రామంలో రూ. 30 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నానన్నారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని తెలిపారు. హనుమంతు నాయక్, శ్రీనివాస్, ప్రభాకర్, మన్నె రమేష్, రంగస్వామి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలో డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

వివిధ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 9 నుంచి, ఎంఈ/ఎంటెక్ (ఏఐసీటీఈ) కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, రెండో సెమిస్టర్ పరీక్షలను వచ్చే నెల10 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జగద్గిరిగుట్ట, జూన్27 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బీజేపీ నేతలు పేర్కొన్నారు. జనసంఘ్ వ్యస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీని స్మరిస్తూ గురువారం జగద్గిరిగుట్టలోని వేంకటేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు ముఖర్జీ సేవలను కొనియాడారు. అంతకుముందు వేంకటేశ్వర ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో బీజేపీ జిల్లా, నియోజకవర్గ కన్వీనర్లు మల్లారెడ్డి , జేకే శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శేషగిరి, ప్రకాశ్ గుప్తా, విఠల్, కెప్టెన్ భీమయ్య, సుధ, పరశురాం, వేణు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయం వద్ద మొక్కలు నాటుతున్న బీజేపీ నేతలు

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

పూల్‌బాగ్ కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవీందర్ రెడ్డి, డీఈ బాలకిషన్, ఏఈ రషీద్

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 27 : సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం బాలానగర్ డివిజన్ పరిధిలోని పుల్‌బాగ్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రోడ్డు పనుల్లో లెవలింగ్ సరిగా చూడాలని, వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పనులను త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఈ బాలకిషన్, ఏఈ రషీద్, కాలనీ అధ్యక్షుడు సభాపతి రెడ్డి, అనిల్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, భగవాన్, మల్లారెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా శ్రీహరి

శ్రీహరిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

జగద్గిరిగుట్ట, జూన్ 27 : మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా జగద్గిరిగుట్టకు చెందిన సిరిపంగి శ్రీహరి నియమితులయ్యారు. ఈమేరకు యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి నియామకపత్రం అందజేసినట్టు తెలిపారు. పార్టీ నియోజకవర్గ నేతలు శ్రీశైలంగౌడ్, కొలను హన్మంతారెడ్డి తదితరులు శ్రీహరిని అభినందించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, ఐలయ్య, నర్సయ్య, రామక్రిష్ణ, సోమేశ్, అఖిల్ పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

రామంతాపూర్,జూన్ 27: తెలంగాణలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలను కో రుతూ రజక రిజర్వేషన్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపిరజక గురువారం ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి కేంద్రానికి పంపాలని కోరారు.

20వేల లీటర్ల వరకు వాడుకున్న

తాగునీటికి బిల్లులు చెల్లించొద్దు

● కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అల్లాపూర్, జూన్ 27 : గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన 20వేల లీటర్ల ఉచిత తాగునీరు వాడుకుంటున్న ప్రజలు బిల్లులు చెల్లించవద్దని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దార్‌నగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పాడవడంతో మురుగునీరు పారుతోందని, సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే అధికారులతో కలిసి సఫ్దార్‌నగర్‌లో పర్యటించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలంలో అండర్‌గ్రౌండ్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండటంతో అపరిశుభ్రత కారణంగా ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. అధికారులు పాత పైపులైన్ స్థానంలో కొత్త పైపులైన్ వేసి సమస్యను పరిష్కరించాలన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ఇంటింటికీ 20 వేల లీటర్ల మంచినీటిని ఉచితంగా అందించగా ప్రస్తుతం జలమండలి అధికారులు గతంలో వాడుకున్న నీటికి సైతం బిల్లు కట్టాలంటూ వేధిస్తున్నారని, పేదలను పీడించడం సబబు కాదన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టి వసూలు చేస్తే వారితో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు.

కార్యక్రమంలో లింగా అయిలయ్య, వీరారెడ్డి, సయ్యద్ రియాజ్, ముత్యాల దుర్గ, జీహెచ్ఎంసీ ఏఈ రంజిత్, డీఈ ఆనంద్, జలమండలి డీఎం విలియం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సఫ్దార్‌నగర్‌లో అధికారులతో కలిసి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

మా స్థలానికి రక్షణ కల్పించండి..

విలేకరుల ఎదుట గోడును వెళ్లబోసుకుంటున్న బాధితులు

కుత్బుల్లాపూర్, జూన్ 27 : తమ భూమిని కొంతమంది అధికార పార్టీ నాయకులు కాజేయాలని చూస్తున్నారని, రక్షణ కల్పించాలని జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్‌కు చెందిన సత్యనారాయణ కుటుంబసభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. బుధవారం బాధిత వ్యక్తి సత్యనారాయణ, తన కుటుంబసభ్యులతో కలిసి విలేకరుల ఎదుట గోడు వెల్లబోసుకున్నారు. కుత్బుల్లాపూర్‌లో గ్రామకంఠం ద్వారా 1973లో స్థలాన్ని పొందామని అక్కడే కొంతస్థలంలో నివాసగృహాలను ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నామన్నారు. మిగిలిన 200 గజాల స్థలాన్ని స్థానికంగా ఉన్న అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు తమను బెదిరిస్తూ రాత్రికి రాత్రే ఒక రూమ్ ఏర్పాటు చేశారన్నారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీస్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని, ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని తమ స్థలాన్ని ఇప్పించి రక్షణ కల్పించాలని వారు వేడుకుంటున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 27 : శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం స్వామివారికి పారువేట శ్రీనివాసుడి అలంకారం, తిరుప్పావడ సేవ, పద్మావతి అమ్మవారికి బిల్వ దళములతో సహస్ర నామార్చన, ఆండాల్ అమ్మవారికి శుష్కఫల అర్చనతో పాటు తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహామృత్యుంజయ యాగ పూజలో పాల్గొన్న భక్తులు

నేడు జాబ్ మేళా

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 27: నిరుద్యోగ యువతకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 28న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు.టెన్త్, ఇంటర్మీడియేట్, డిగ్రీ అర్హత కల్గిన యువతీ యువకులకు జాబ్‌మేళాకు హాజరుకావాలని, వేతనం రూ.25 వేల వరకు ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 7386809422 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎంజేఎఫ్ మేడ్చల్ జిల్లా కన్వీనర్‌గా జోగు వెంకట్

జోగు వెంకట్

కుత్బుల్లాపూర్, జూన్ 27: తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం(టీఎంజేఎఫ్) మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కన్వీనర్‌గా కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన జోగు వెంకట్ నియామకమయ్యారు. సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం కంటోన్మెంట్‌లో జరిగింది. ఈరాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల బాబు అధ్యక్షత వహించగా ఎండబ్లూజేయూ జాతీయ ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్‌మాదిగ, తెలంగాణ ఇన్‌చార్జి సుంచు అశోక్, టీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేశ్ పాల్గొన్నారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర, రాష్ట్ర కమిటీ ప్రతినిధులకు వెంకట్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రతినిధులు ఎర్ర యాకన్న, సి.దశరథ్, మహంకాళి భిక్షపతి, నరేందర్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● నిజాంపేట్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి

దుండిగల్,జూన్ 27 : వానాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ మున్సిపల్ కార్